ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 25 డిసెంబరు 2024

సన్న ధాన్యం పక్కదారి





సన్నరకం ధాన్యం పక్కదారి పడుతోంది... ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతోపాటు బోనస్ ప్రకటించినా రైతులు ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్నారు. తేమ శాతంతో పాటు వారు సూచించిన విధంగా బియ్యం గింజ పొడవు, మందం ఉంటేనే సన్నరకంగా పరిగణిస్తున్నారు. రైతులు గ్రామాలకు వచ్చిన వ్యాపారులకే విక్రయిస్తున్నారు. దీంతో రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేయాలనే ప్రభుత్వం నిర్ణయం ఆచరణ సాధ్యమయ్యేలా అగుపించడం లేదు.

- కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి రైతుల విముఖత
- ఇప్పటిదాకా సెంటర్లకు చేరింది కేవలం 20 శాతమే
- దొడ్డు బియ్యంగా పరిగణిస్తున్న సెంటర్ నిర్వాహకులు
- మిల్లులు, ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకే మొగ్గు

మంచిర్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయం ఆచరణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కొను గోలు కేంద్రాలకు ఆశించిన మేర సన్నరకం ధాన్యం రాక పోవడమే ఈ పరిస్థితికి కారణమవుతోంది. చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో ఈసారి రైతులు పెద్ద మొత్తంలో సన్న వడ్లు సాగు చేశారు. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాలకుగాను దాదాపు 80 శాతం అంటే 1.28 లక్షల ఎకరాల్లో సన్న రకాలు వేశారు. మిగతా 20 శాతం 32వేల ఎకరాల్లో మాత్రమే దొడ్డు వడ్లు పండించారు. తద్వారా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవ సాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో 3.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ సన్నాలు ఆశించిన స్థాయిలో సెంటర్లకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

సెంటర్లకు చేరింది 23 శాతమే...

జిల్లాలో ఇప్పటివరకు 317 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 41,307 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఇందులో సన్నాలు 9,799 మెట్రిక్ టన్నులు మాత్రమే. సన్నాలలో అత్యధికంగా జైశ్రీరాం సాగైన ట్లు అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. అయినప్పటికీ సన్న వడ్లు సెంటర్లకు రావడం లేదు. సాగు విస్తీర్ణాన్ని బట్టి చూస్తే దాదాపు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు దిగుబడి రావాలి. జిల్లాలో 80 శాతం సన్నాలు సాగు చేస్తే, ఇప్పటి వరకు 23 శాతం ధాన్యం సెంట ర్లకు రావడం గమనార్హం. మిగిలిన ధాన్యం రైస్‌మిల్లులు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది.

ప్రైవేటులో అమ్మేందుకే మొగ్గు....

సన్నరకం ధాన్యం పండించిన రైతులు ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాకుండా రైస్ మిల్లులు, వ్యాపారులకు అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్‌లో మాయిశ్చర్, క్వాలిటీ వంటివి పట్టించుకోకుండా రైతుల దగ్గరికే వెళ్లి కాంటా వేస్తున్నారు. డబ్బులు కూడా వెంటనే చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. 17 శాతం తేమతోపాటు తప్ప, తాలు, మట్టి లేకుండా వడ్లను శుభ్రం చేయాలి. సెంటర్లలో ధాన్యం కుప్పలు పోసి కాంటా కోసం రోజుల తరబడి పడిగాపులు కాయాలి. ఆ తర్వాత మిల్లుకు తరలించే వరకు రైతులదే బాధ్యత.

మిగతా 7వ పేజీలో..

ఓరియంట్‌లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి


దీక్షలో మాట్లాడుతున్న రాములు నాయక్

కాసిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవా పూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో స్థాని క నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పించాలని, ప్రభా విత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కంపెనీ పర్మినెంటు వర్కర్స్ లోకల్ యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మంగళవారం కంపెనీ ప్రధాన గేటు ఎదుట ఒక్క రోజు దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల క్రితం ఏర్ప డ్డ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఓరియంట్ సిమెంట్ కంపెనీని సీకే బిర్లా యాజమాన్యం ఆదాని గ్రూపునకు అమ్మకం చేస్తున్న క్రమంలో స్థానిక ఉద్యోగులకు, నిరుద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగో ప్లాంటు విస్తరణలో భాగంగా 4 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీఇచ్చారని, ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి పురోగతి లేదన్నారు. పరిసర గ్రామాలతో పాటు దేవాపూర్‌లో సీసీ రోడ్లు, విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యాలను కల్పిం చాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఏర్పాటు చేసిన పవర్‌ప్లాంట్ ద్వారా దేవా పూర్‌లోని ప్రతీ ఇంటికి ఉచితంగా కరెంటు ఇవ్వాలన్నారు. నాయకులు తత్ర భీంరావు, వై. శ్రీనివాస్, సార రాజయ్య, సామ సనత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మడావి గంగారాం, సీపీఐ కార్యదర్శి గట్టు సర్వేశం, భీమన్న, శంకర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష ఎవరి ప్రయోజనాల కోసం

ప్రభుత్వాలు ఆదివాసీలకు, కార్మికులకు ఏం చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దీక్ష ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. కార్మిక సంఘాలన్ని యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించి కార్మికుల హక్కులను కాలరాశాయన్నారు. గిరిజనులు కంపెనీలో భూములు కోల్పోయి జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల పక్షాన పోరాడాలన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా శ్రీమతి రిజ్వానా భర్త : షేక్ నజీర్, వయస్సు : 49 సం॥లు, వృత్తి : గృహిణి, నివాసము : ఇ.నెం. 8-21/1, పోస్ట్ & మండలం : జన్నారం, జిల్లా : మంచిర్యాల.
[illegible]
ఫోన్: 98492 14324

నర్సింగాపూర్‌ను కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దు


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

హాజీపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామాన్ని మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రకటన చూసి నర్సింగాపూర్ గ్రామంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామంలోని ప్రజలు పూర్తిగా వ్యవసాయ, కూలీ పనిపై ఆధారపడి జీవిస్తున్నారని, గ్రామంలోని సుమారు 355 మంది ఉపాధిహామీ పథకం కింద కూలీలుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దన్నారు. బీజేపీ నాయకులు ఎనగందుల కృష్ణమూర్తి, బొలిశెట్టి తిరుపతి, లగిశెట్టి వెంకటి, సాంబారు తిరుపతి పాల్గొన్నారు.

ఫిజిషియన్ గదిని ప్రారంభించిన డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గర్మిళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అసంక్రమణ వ్యాధుల పైన కేటాయించిన ఫిజిషియన్ వైద్య సేవల గదిని మంగళవారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వీటి ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక కేంద్రం ద్వారా పంపబడిన కేసులను ఫిజిషియన్ ద్వారా పరీక్షలు చేయించి చికిత్సలు అందిస్తామన్నారు. అలాగే కౌన్సెలింగ్ పరీక్షలు, మందులను అందజేస్తామన్నారు. స్టాఫ్‌నర్సు, ల్యాబ్‌టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌లు భీష్మ, అశోక్, ప్రసాద్, లింగారెడ్డి, లక్ష్మణ్, వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం


మాట్లాడుతున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

బెల్లంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు అంబేద్కర్ చూపిన మార్గాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. అంబేద్కర్ సమానత్వం, న్యాయం వంటి విలువల కోసం తాము పోరాడుతామని తెలిపారు. నాయకులు కుంబాల రాజేష్, కాసర్ల యాదగిరి, దుర్గం గోపాల్, సబ్బని రాజనర్సు, శంకర్, మల్లయ్య, సురేష్, రాంనాధ్, పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలు క్షమించరానివని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హోంమంత్రి అమిత్‌షా కావాలనే అంబేద్కర్‌ను, దళితులను కించపరిచేలా పదే పదే విమర్శలు చేస్తున్నాడని పేర్కొన్నారు. దేశ ప్రజలందరికి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలన్నారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్న రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు పెట్టేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుద ర్శన్, శ్రీనివాస్, మొయ్య రాంబాబు, తుంగపిండి శంకర్ పాల్గొన్నారు. అనంతరం 8వ వార్డుకు చెందిన తొటం సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబీకులను ఎంపీ పరామర్శించారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంటనే బహుజనులకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ పట్ల హేళనగా మాట్లాడారన్నారు. దేశంలోని బహుజనులందరికి క్షమాపణలు చెప్పాలన్నారు. రాజేంద్ర ప్రసాద్, వేముల కిరణ్, రాములు, రామిళ్ల రాజేశ్, వెల్పుల తిరుపతి, మంతెన రవి, మల్లయ్య, దుర్గం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నెన్నెల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు, నార్వాయిపేట, లంబాడి తండాల్లోని గుడుంబా తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సోదాలు చేశారు. భూమిలో పాతిపెట్టిన డ్రమ్ములను ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నాటుసారా తయారీని పక్కన పెట్టి ఇతర వ్యాపకాలు చూసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు అధికారులు సూచించారు. ఎస్సై ప్రసాద్, చెన్నూరు, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సైలు రమణ, వెంకటేష్ పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నెన్నెల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నందులపల్లి శివారు మామిడి తోటలో పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. పేకాడుతున్న ఇద్దరిని పట్టుకోగా, మరో నలుగురు పారిపోయారన్నారు. వారి నుంచి రూ. 3 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

తాండూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. రికార్డులు, లాకప్, బ్యారక్, టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఐ కిరణ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. డీసీపీ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. కాలనీల్లో సీసీ కెమెరాలను అమర్చే విధంగా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్‌కుమార్,సిబ్బంది ఉన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



మ్యాదరిపేట కిరాణ దుకాణాలను తనిఖీ చేస్తున్న అటవీ శాఖ అధికారులు

దండేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గాలి పటాలు ఎగురవేసేందుకు చైనా మాంజా దారాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి ఎఫ్ఆర్‌వో సుష్మారావు హెచ్చరించారు. మంగళవారం మ్యాదరిపేట, తాళ్లపేట, ముత్యంపేట ప్రధాన సెంటర్‌లో దుకాణాల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. గాలిపటాల కోసం చైనా మాంజా దారాలు అమ్మినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మాంజా దారంతో గాలిపటం ఎగరవేసినప్పుడు మనుషులకు, పక్షులకు చుట్టుకుంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. డిప్యూటీ ఆర్‌వో పోచమల్లు, ఎఫ్ఎస్‌వో శేషారాం, ఎఫ్‌బీవోలు సాయికుమార్, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సమయంలో గాలిపటాలను చైనా మాంజాతో ఎగురవేయడం వల్ల పక్షులకు హానీ ఉంటుందని ఎఫ్ఆర్‌వోలు శ్రీనివాస్, సుష్మారావులు పేర్కొన్నారు. మండల కేంద్రం, గ్రామాల్లోని గాలిపటాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చైనామాంజాలను విక్రయించవద్దని సూచించారు. గాలిపటాలను ఎగురవేసినప్పుడు చైనామాంజాకు తగిలి పక్షులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బీట్ అధికారులు శ్రీనివాస్, రహీమొద్దీన్ పాల్గొన్నారు.

సీఆర్‌టీల సమ్మెకు తరలివెళ్లిన నాయకులు

కోటపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీల సమ్మెకు మద్దతుగా మంగళవారం మండలంలోని తుడుందెబ్బ నాయకులు ఉట్నూరుకు తరలివెళ్లారు. ఉట్నూరులో వారం రోజులుగా సమ్మె చేస్తున్న సీఆర్‌టీలకు ఆదివాసీ సంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్, ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు తరలి వెళ్లారు.

కళాశాలలను ఏర్పాటు చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేయాలని టెక్నికల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు మంగళవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మంచిర్యాలలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలో మహిళ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని, ధర్మపురి నియోజకవర్గంలో ప్రభుత్వ కోఎడ్ పాలిటెక్నిక్ కళాశాల, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అక్షయ్‌కుమార్, శ్రీకాంత్,మల్లికార్జున్, మనోజ్‌కుమార్, పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని వినతి

జైపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జైపూర్ మండలంలోని యువత కోసం మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మంగళవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు చెన్నూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇలియాజుద్దీన్ విన్నవించారు. ఇందారం శివారులోని సింగరేణి భూమి సర్వే నెంబరు 561, 562లో స్టేడియం ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రవితేజ, శశిందర్‌యాదవ్, సురేందర్, సతీష్‌కుమార్, సాయిగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సంజయ్ యాదవ్, సమ్మయ్య, అజయ్, అభి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

తాండూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను మంగళవారం తాండూర్ మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పట్టెం విష్ణుకళ్యాణ్‌లు కలిసి ఎంపీకి పూలమొక్కను అందజేశారు.

- కోర్టును ఆశ్రయించిన ఎనిమిది మంది
- యథాతథ పరిస్థితి కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు

ప్రభుత్వ స్థలం వేలంపై వివాదం



కాగజ్‌నగర్ బోరిగాంలో వేలం వేసేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భూమి(ఫైల్)

కాగజ్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో రాజీవ్ స్వగృహం కోసం చేపట్టిన వేలం ప్రక్రియపై వివాదం తేలలేదు. 2022లో మొదటి సారి వేలం వేసేందుకు యత్నించినా వివాదం కారణంగా నిలిచిపోయింది. కాగజ్‌నగర్ మండలంలోని బోరిగాం గ్రామ పంచాయతీలోని 117 సర్వే నంబరులో రాజీవ్ స్వగృహ కోసం సేకరించిన భూమిని లే అవుట్ వేసి బహిరంగ వేలం నిర్వహిం చేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. భూముల వేలం పై ఇప్పటికే మూడు దఫాలుగా ప్రీ బిడ్ సమావేశం నిర్వహించింది. భూముల వేలంపై ప్రజల్లో విస్తతంగా ప్రచారం కల్పించింది. 2004లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కోసం భూములను సేకరించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు రాజీవ్ స్వగృహ కింద ప్లాట్లను కొనుగోలు చేసేందుకు కార్పొరేషన్‌తో ఒప్పం దాలు చేసుకున్నారు. ఇందులో చాలా మంది వాయిదాలు సైతం చెల్లించారు. కొంత మంది నాలుగు, ఐదు వాయిదాలతోనే సరిపుచ్చారు. అయితే వాయిదాలు చెల్లించకుండా ఆపి వేసేం దుకు ప్రధానంగా అప్పట్లో ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపి వేయడమే కారణమని చెబుతున్నారు. నాటి నుంచి నేటి వరకు కార్పొరేషన్ అరకొర వాయిదాలు చెల్లించిన లబ్ధిదారులకు సంబంధించి డబ్బులు తిరిగి చెల్లించలేదు. అటు స్థలాలను ఇవ్వలేదు. లబ్ధిదారుల అభ్యంత రాలను పట్టించుకోకుండా అభ్యుదయ టౌన్ షిప్ పేరిట వేలం వేసేందుకు నిర్ణయించడంతో ఈ వ్యవహారంపై వివాదం నెలకొంది.

● **ఈ వెంచర్‌లో..**

మొత్తం 174 ప్లాట్లు ఈ వెంచర్‌లో ఏర్పాటు చేశారు. గతంలోనే 103 మందికి ప్లాట్లు కేటాయించారు. మిగిలిన 71 ప్లాట్ల కోసం వేలం నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ క్రమంలో ఈస్థలంపై మరొ కొత్త వివాదం తెరపైకి వచ్చింది. పట్టేదారు నుంచి ఈ స్థలాన్ని సేకరించే ముందే అప్పట్లో కొంత మంది సదరు పట్టే దారు వద్ద వివిధ సర్వే నంబర్లలో భూమిని కొనుగోలు చేశారు. కాగా ఈ విషయమై పట్టించుకోకుండా సదరు పట్టేదారు స్థలాన్ని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు అప్పట్లో విక్రయించారని అధికారులు చెబుతున్నారు. స్థలానికి సంబంధించి కార్పొరేషన్ పూర్తి పరిహారం చెల్లించిందని అధికారులు చెబుతుండగా ఇందులో ఎనిమిది మంది మాత్రం భూమి కొనుగోలు చేసి తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా సేకరిస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపైనే హైకోర్టును ఆశ్రయించారు. బాధితుల వాదన, ఆధారాలను పరిగణలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేంత వరకు యథాతథ పరిస్థితిని కొనసాగించాలని స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ప్రక్రియకు పూర్తిగా బ్రేక్ పడింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ భూముల సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉందని చెబుతన్నారు.

రెండేళ్ల క్రితమే టెండరు..

- కిరణ్, తహసీల్దార్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బోరింగాంలోని 117 సర్వే నంబరులో 71 ప్లాట్ల కోసం రెండేళ్ల క్రితం టెండరు ప్రక్రియ నిర్వహించారు. పలువురు కోర్టుకు వెళ్లడంతో వాయిదా పడింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తదుపరి ఉత్తర్వులు రాగానే మళ్లీ టెండరు నిర్వహిం చేందుకు చర్యలు తీసుకుంటాం.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లులలో బుధవారం నుంచి ఈనెల 29 వరకు ఐదు రోజుల పాటు సీసీఐ పత్తి కొనుగొళ్లను తాత్కాలికంగా నిలిపి వేయనున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా సెలవుతో పాటు జిన్నింగు మిల్లుల పత్తి, పత్తి గింజల నిలువలు అధికంగా ఉన్నందున ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి, సిర్పూర్, కౌటాల మిల్లుల్లో కొనోగళ్లు ఉండవని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న తమకు రావల్సిన పది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మంగళవారం ఏఎన్ఎంలు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజేందర్, ఏఎన్ఎంలు మహేశ్వరి, శ్రీదేవి, హీరాబాయి, చాందిని, సుజాత పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం బీబ్రా గ్రామ పంచాయతీ పరిధిలోని దేవా జీగూడ గ్రామాన్ని నూతన ప్రతిపాదన జెండాగూడెం గ్రామ పంచాయతీలో కలపవద్దని మంగళవారం గ్రామస్థులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్తయ్య, దేవయ్య, సాయికుమార్, తిరుపతి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో కొత్త మెనూ తప్పనిసరి



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, ఆహార సామగ్రి నాణ్యత, మధ్యాహ్న భోజనం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్ చార్జీల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలన్నారు. వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులు వినియోగించాలని చెప్పారు. కాలం చెల్లిన వస్తువులను ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో నూతన మెనూ పట్టికను తప్పని సరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు, మూత్రశాలలు, సౌచాలయాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ప్రిన్సిపాల్, గిర్దావర్, సిబ్బంది ఉన్నారు.

డిజిటల్ విధానంతో వినియోగదారులకు న్యాయం

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సమగ్ర న్యాయం జరిగేందుకు ఆస్కారం ఉంటుందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి బాబా వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం టీఎస్‌సీఎస్‌సీ ఎల్‌డీఎం నర్సింహరావు, మెడికల్ అధికారి వినోద్‌కుమార్, సహకార తూనికల కొలతల శాఖాధికారి సుందర్‌రావు, ఉమ్మడి జిల్లా వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌లతో కలిసి ఎల్‌పీజీ, పెట్రోల్‌బంక్ డీలర్లు, వినియోగదారులకు డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ ద్వారా సమగ్ర న్యాయం పొందవచ్చన్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సాంకేతికత ఆవశ్యకత, గ్రామీణ ప్రాంతాలు, సంబంధిత అంశాలకు మరింత అందుబాటులో ఉండేలా చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. వినియోగదారుల కోసం వర్చువల్ విచారణలు, ఆన్‌లైన్ ఫిర్యాదు దాఖలు, డిజిటల్ వనరుల ప్రయోజనాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్‌గూడ గ్రామానికి చెందిన అప్పన్నకు చెందిన ఆవు చిరుత దాడిలో మృతి చెందగా బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ రూ.25 వేల నష్ట పరిహారం చెక్కును అంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని కలిగించవద్దన్నారు. ఏదైనా పశువులకు హాని కలిగితే తమ దృష్టికి తీసుకు వస్తే పరిహారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారులు రాజేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల నిరసన

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌ల ఆధ్వర్యంలో అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ పేరుతో చేపట్టిన నిరసనలో భాగంగా అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి, గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రభుత్వ ఆసుపత్రి, హడ్కో కాలనీ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత దేశ స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్‌ను అవవమానించేలా మాట్లాడిన కేద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, శ్యాం, సంతోష్, బాలేష్‌గౌడ్, చరణ్, అనీల్‌గౌడ్, ప్రతిభ, కళావతి, రమేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

జైనూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కాసుపటేల్‌గూడలో చేతన ఫౌండేషన్ సహకారంతో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జైనూర్, సిర్పూర్(యు) మండలాల పరిధిలోని 32 మంది ఆదివాసీ మహిళాలకు కుట్టుమిషన్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు మంగవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ వైస్ చైర్మన్ వెంకటేష్, డీఎస్పీ కరుణకర్, సీఐ రమేష్, ఎస్సైలు రామారావు, రామకృష్ణారావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు పాటుపడాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న టీడీపీ నాయకులు

వాంకిడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీకి పూర్వ వైభం కోసం కార్యకర్తలు పాటుపడాలని పార్టీ పార్లమెంట్ కమిటీ కన్వీనర్ గుల్లపల్లి ఆనంద్ అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. పార్టీ రాష్ట్రంలో మళ్లీ పూర్వ వైభవం కోసం అందరు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మారాం, దౌలత్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల భయాందోళన

పెంచికలపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా మండలంలో పెద్దపులి కదిలికలు ప్రజలకు భయాందోళకు గురి చేస్తున్నాయి. మండలంలోని బొంబాయిగూడ గ్రామ సమీపాన ఉచ్చమల్లవాగు సమీపలంలో మంగళవారం పంట పొలాల్లో, కొండపల్లి బొక్కివాగు ప్రాంతంలో పులిపాద ముద్రలను స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. వారు ఆ ప్రాంతానికి చేరుకుని పులి అడుగులు లేవని నిర్ధారించారు. అవి అంతకు ముందు రోజువని చెప్పారు.

ఆకట్టుకున్న బెల్లంపల్లి ఆసుపత్రి స్టాల్

బెల్లంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గోలేటిలో నిర్వహించిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బెల్లంపల్లి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. షుగర్‌ను కంట్రోల్‌చేయడం, ఆల్కహాల్ తీసుకోవడం వల్ల తలెత్తే అనార్థాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారం తీసుకోవాలో తెలియజేశారు. స్టాల్‌ను సందర్శించిన జీఎం వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం వైద్య సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



సొంతింటి కల నెరవేర్చాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్మికుల సొంతింటి కల నెరవేర్చేవరకు పోరాడుతూనే ఉంటామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆర్కే 5 గనిపై నిర్వహించిన మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు రెండు, మూడు రోజులు విధులకు హాజరు కాకుంటే వైద్య పరీక్షల పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. మారుపేర్ల మార్పిడి, విజిలెన్స్ బాధితుల సమస్య పరిష్కారానికి యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నా, దాన్ని ఇంతవరకు అమలు చేయడం లేదని చెప్పారు. ఎన్నో రోజులుగా కార్మికుల సొంతింటి విషయంలో హామీల వరకు పరిమితమవుతూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మోసగిస్తున్నాయని ఆరోపించారు. ఆ డిమాండ్ నెరవేర్చే వరకు తాము సంఘాలు, యాజమాన్యంపై ఒత్తిడి చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగల శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి శ్రీధర్, నాయకులు వెంకటిరెడ్డి, పెరుక సదానందం, పిట్ కార్యదర్శి చిగురు లక్ష్మణ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి బట్టు సురేందర్, ఇప్ప నరేష్, బందు శ్రీనివాస్, పోతు వెంకటేశ్ పాల్గొన్నారు.

పిట్ కమిటీ సభ్యుల పరిచయం

శ్రీరాంపూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీ 3, 3ఏ, ఆర్కే న్యూటెక్ గనుల పిట్ కమిటీ సభ్యులను ఆయా గనుల మేనేజర్లకు పరిచయం చేశారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గని మేనేజర్ వెంకట్రావుకు బాధ్యతలు తీసుకున్న చీఫ్ అడ్వైజర్ సాదుల భాస్కర్, పిట్ కార్య దర్శి వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నరేష్‌ను పరిచయం చేశారు. ఆర్కే న్యూ టెక్ గని మేనేజర్ స్వామి రాజుకు బాధ్య తలు తీసుకున్న ఉప్పాల సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి జైపాల్‌రెడ్డిని పరిచయం చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న బీఎంఎస్ నాయకులు

సమస్యలతో కార్మికులు సతమతం

శ్రీరాంపూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశంలోని బొగ్గు గని కార్మికులు పలు సమస్యలతో సతమవుతున్నారని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటు, రిటైర్డ్ కార్మికుల పించన్ పెరుగుదల, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌లో అవినీతిపై సీబీఐ విచారణ జరిపేలా చూస్తామని అన్నారు. కార్మికులకు 250 చదరపు గజాల భూమి, 50 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో గోదావరిఖనిలో బీఎంఎస్ 19వ త్రై వార్షిక మహాసభలు నిర్వహిస్తున్నామని, వాటిని విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కేంద్ర కార్యదర్శి జీడి ప్రభాకర్, ఏరియా కోశాధికారి గూడ శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి పురుషోత్తమ చారి, నాయకులు జల్ల తిరుపతి, గోల్ల మహేందర్, గోనె రామకృష్ణ, సామల కిశోర్, చల్ల శ్రీనివాస్, కుంట రాజు, ఆనం వినయ్ కుమార్, కుమ్మరి చందు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

రహదారుల పక్కన కూరగాయలు విక్రయిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



ఆంధ్రజ్యోతి: రహదారుల పక్కన కూరగాయలు విక్రయాలపై చర్యలేవీ?

కమిషనర్: కూరగాయల వ్యాపారులతో సమావేశం నిర్వహించాం. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి కాంటా చౌరస్తా వరకు రహదారుల పక్కన కూరగాయలు విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని తెలిపాం. చిరు వ్యాపారులకు నూతన కూరగాయల మార్కెట్ భవనం ఎదుట స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వీధి కుక్కల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: వీధి కుక్కల నివారణకు ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. పలు వార్డుల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని తరలించాం.

ఆంధ్రజ్యోతి : పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

కమిషనర్ : పట్టణంలోని అన్ని వార్డుల్లో రోజు వాహనాల ద్వారా చెత్త సేకరిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిసర ప్రాంతాల్లో చెత్తను పడేయవద్దని సూచిస్తున్నాం. స్వచ్ఛ మున్సిపాలిటీ కోసం ప్రజలందరూ సహకరించాలి.

- బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి)

ఘనంగా భూమయ్య వర్ధంతి

గర్మిళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజాఫ్రంట్ పూర్వ అధ్యక్షుడు ఆకుల భూమయ్య 11వ వర్ధంతిని మంగళవారం మంచిర్యాలలోని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించారు. తెలంగాణ కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. ప్రజా కళాకారులు ఆడెపు సమ్మయ్య, జైపాల్‌సింగ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ కన్వీనర్ రాజన్న, అధ్యక్షుడు పోషన్న, నాయకులు సత్యనారాయణ, అజీజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగు పాఠాలు నేర్చుకుంటూ..



వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

పంట చేనులో కలుపు తీస్తున్న విద్యార్థిని

పొలం బాట పట్టిన గురుకులాల విద్యార్థులు

9, 10 తరగతులు, కళాశాల విద్యార్థులను కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖతోపాటు రైతులు వ్యవసాయ క్షేత్రాలు, పంట పొలాలు, కూరగాయల తోటల వద్దకు తీసుకెళ్లి సాగు తీరును వివరిస్తున్నారు. నెలలో ఒక రోజు పొలం బాట పడుతున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఉద్యానవనశాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ పంటల సాగుపై అవగాహన పెంచుకుంటున్నారు. రైతుల నుంచి ఎన్నో అనుభవాలను నేర్చుకుంటున్నారు. పొలం సిద్ధం చేయడం, విత్తనాలు నాటి మొలకెత్తడం, కాపు దశ, పంట చేతికి వచ్చే తరుణం, ఆయా క్రమంలో వచ్చే చీడపీడలు, ఇతర ప్రతికూలతల నుంచి వాతావరణ విపత్కర పరిస్థితులను అంచనా వేసే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, వివిధ రకాల సేంద్రియ ఎరువుల పని తీరును వివరిస్తున్నారు.

- పొలం బాట పట్టిన గురుకులాల విద్యార్థులు
- పంటలు పరిశీలిస్తూ.. విజ్ఞానం పొందుతూ

బెల్లంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. వారు చదివే పాఠ్యాంశాలతోపాటు పంటల సాగుపై క్షేత్రస్థాయిలో వివరిస్తున్నారు. దీంతో వారికి వ్యవసాయం ప్రాముఖ్యత, సాగుకు సంబంధించిన విషయాలు అవగతమవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ క్షేత్రాలు, పండ్ల తోటల్లో ఉంటూ వరి నాట్లు వేయడం, ఇతరత్రా వ్యవసాయ పనులపై అవగాహన కల్పిస్తున్నారు. వీరికి ప్రభుత్వం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు సైతం అందజేస్తోంది. భవిష్యత్‌లో విద్యార్థులు వ్యవసాయ, ఉద్యాన వంటి కోర్సులకు వెళ్లినప్పుడు సర్టిఫికెట్లు ఉపయోగపడ నున్నాయి.



విద్యార్థులకు పండ్ల తోటలపై అవగాహన కల్పిస్తున్న సంబంధిత అధికారులు

భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుంది

- ఎ మౌనిక, వ్యవసాయ వృత్తి విద్య బోధకురాలు



విద్యార్థి దశలోనే వ్యవసాయంపై అవగాహన ఉంటే భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్ తర్వాత అగ్రికల్చర్, ఉద్యాన శాఖలో ఉద్యోగ సాధనకు ప్రభుత్వం అందించే సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి. స్వయం ఉపాధిగా సైతం విద్యార్థులు వ్యవసాయం చేసుకుంటూ ముందుకు వెళ్లవచ్చు.

వ్యవసాయం గురించి తెలుసుకున్నా..



అక్షయ, గురుకుల కళశాల విద్యార్థిని

ఉపాధ్యాయులు పొలాల వద్దకు, వ్యవసాయ క్షేత్రాల వద్దకు తీసుకెళ్లి పంటలు ఏ విధంగా పండిస్తారనే విషయాలను తెలుసుకున్నా. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలను నేరుగా రైతుల పొలాల వద్దకు వెళ్లి పరిశీలించడంతో అవగాహన వచ్చింది. రైతులు విత్తనం నాటినప్పటి నుంచి దిగుబడి, మార్కెటింగ్, తదితర అంశాలు, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకున్నాం.

పంటలపై అవగాహన వస్తుంది

-జె తేజశ్విని, గురుకుల కళాశాల విద్యార్థిని



నేను మంచిర్యాలలోని గురుకుల కళాశాలలో బైపీసీ సెకండియర్ చదువుతున్నా. వ్యవసాయానికి సంబంధించి పంట పొలాలు, వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లి గమనిస్తుండడంతో పూర్తి స్థాయిలో అవగాహన వస్తుంది. దీంతో ఇంటర్ చదువు పూర్తయ్యాక ఉద్యోగ అన్వేషణలో వ్యవసాయ సాగు అనుభవాలు ఎంతో ఉపయోగపడతాయి.

సన్న ధాన్యం పక్కదారి

(5వ పేజీ తరువాయి)

ఇన్ని ఇబ్బందులు పడి సెంటర్లలో అమ్ముకోవడం కంటే.. పంట కోసిన వెంటనే వ్యాపారులకు విక్రయించడమే మేలనే భావనలో రైతులు ఉన్నారు. పైగా ప్రభుత్వ మద్దతు ధరతో పోల్చితే ప్రైవేట్‌లో అంతకంటే ఎక్కువే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. మిల్లుల్లో బస్తాకు ఒకటి రెండు కిలోలు కోతలు తప్పవు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీ చార్జీలు రైతులే భరించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ మద్దతు ధర ఏ- గ్రేడ్ రకానికి రూ.2,320, బోనస్ రూ.500తో కలిపి రూ.2,820 వస్తుంది. మిల్లర్లు, వ్యాపారులు జైశ్రీరాం, తదితర రకాలకు క్వింటాలుకు రూ.3వేల పైనే చెల్లిస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాలను గ్రేన్ క్యాలిపర్ పరికరంతో బియ్యంగా మార్చి పరిశీలిస్తున్నారు. బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, మందం 2.5 మిల్లీమీటర్లు ఉంటేనే సన్నాలుగా పరిగణిస్తున్నారు. జిల్లాలో పండించిన చాలా వెరైటీలు వారు సూచించిన విధంగా లేకపోవడంతో సన్నాలుగా గుర్తించడం లేదు. దీంతో రూ.500 బోనస్ కోల్పోవలసి వస్తోంది. ఈ కారణంగా కూడా రైతులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు సన్నరకం రాకపోవడంతో రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం ఎలా పంపిణీ చేయాలనే సమస్య ఉత్పన్నమవుతోంది.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల తేదీ పొడిగింపు

జైపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడా నికి ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జైపూర్ అధ్యయన కేంద్రం సహాయ సమన్వయకర్త జంబోజు సత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పెరియార్ వర్ధంతి

జన్నారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ నాయకుడు పెరియార్ రామస్వామి 51వ వర్ధంతిని మంగళవారం జన్నారంలో బీసీ కులాల ఉద్యమపోరాట సంఘం నాయకులు నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. బీసీల అభి వృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియా డారు. చంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, వీరాచారి, పురుషోత్తం, రాజన్న పాల్గొన్నారు.

వెల్గనూర్ విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



భూపాలపల్లిలో కాకతీయ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

దండేపల్లి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వెల్గనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. వరంగల్ జిల్లాలోని భద్రకాళి దేవాలయం, రామప్ప, వెయ్యి స్తంబాల గుడి, లక్నవరం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. ఆలయాల చారిత్రక కట్టడాలను తిలకించారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

క్రీడాకారులకు జెర్సీల అందజేత

కాసిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ క్రీడాకారులకు సోమగూడెంలో మంగళవారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాజేష్ జెర్సీలను అందజేశారు. అతిథిగా హాజరైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో సత్తా చాటిన మండల ఫుట్‌బాల్ జట్టును అభినందించారు.

క్రీడాకారులను అభినందించిన అధికారులు

జైపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన మండల క్రీడాకారులను ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డిలు మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులను ఎస్ఐ శ్రీధర్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎంఈవో శ్రీనివాస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, కార్యదర్శి ఉదయ్‌కుమార్, పీఈటీలు, కోచ్ సాయికుమార్ అభినందించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కలెక్టరేట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్‌లో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు, టార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుబీమా పథకంలో అర్హులైన లబ్ధిదారుల కుటుంబాలకు అందించాల్సిన పరిహారం చెల్లింపులో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌర సరఫరాల అధికారి పరబ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత

భీమారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భీమారం ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు దామోదర్, కుమారి, సంతోషరాణిలు మంగళవారం పాఠశాలకు రూ. 13 వేల విలువ గల టీవీని అందజేశారు. వారు మాట్లాడుతూ డిజిటల్ తరగతుల కోసం విద్యార్థులకు ఉపయోగకరగా ఉంటుందని అందజేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కైలాసం, సిబ్బంది కుమార్, సదాలక్ష్మీ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఎన్నిక

జన్నారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పు మల్లేశం, ఉపాధ్యక్షులుగా ఉప్పు తిరుపతిలను ఎన్నుకున్నట్లు వ్యవస్థాపడు గోపాల్, అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు నాగేష్‌లు తెలిపారు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

- తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా మండలంలోని సింగరాయపేట గ్రామానికి చెందిన దుబ్బ రాజం నియమితులయ్యారు. ములుగు జిల్లాలో జరిగిన జరిగిన తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలో జాతీయ కన్వీనర్ లక్ష్మణ్ రాజంకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజంను మండల నాయకులు అభినందించారు.

అట్టహాసంగా ప్రారంభమైన జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు



పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి పట్టణంలో జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసం గా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని తిలక్ క్రీడా మైదానంలో 9వ సాఫ్ట్ బేస్‌బాల్ సబ్ జూనియర్ యూత్ అండ్ గర్ల్స్ నేషనల్ చాంపియన్ పోటీలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలను ఇక్కడ నిర్వహించడం సంతోషకరమ న్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముం దుకు వెళ్లి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసంతో పాటు ఉద్యోగ సాధనకు దోహ దపడతాయన్నారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం తెలంగాణ సాఫ్ట్ బేస్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బేస్ పోటీలు నిర్వహణకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పోటీలు ఈ నెల 27న ముగుస్తాయన్నారు. తిలక్ మైదానం అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేయాలని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మైదానం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడను ఆడారు. పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. సాఫ్ట్ బేస్‌బాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువేందర్, ట్రెజరర్ దినాకర్, జిల్లా త్రో బాల్ సెక్రెటరీ యాదండ్ల బలరాం, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఐలయ్య, రాజం, శ్రావణ్, పీఈటీలు రాజ్ మహ్మద్, పీడీలు పద్మ, శిరీష సీనియర్ క్రీడాకారులు యాదండ్ల నర్సయ్య, గోలేటి రాజేష్, ఆనంద్ పాల్గొన్నారు.



తెలంగాణ క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట రేషన్ డీలర్ల నిరసన



ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట నిరసన తెలుపుతున్న రేషన్ డీలర్లు

నస్పూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఎదుట రేషన్ డీలర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా దుకాణాలకు పంపించే బస్తాల్లో తూకం తక్కువ వస్తోందన్నారు. 50 కిలోల బస్తాలో 45 నుంచి 48 కిలోల బియ్యం వస్తోందని, రంగు మారిన బియ్యం సరఫరా అవుతోందని ఆరోపించారు. సరైన తూకం లేకుండానే బియ్యం పంపిణీ చేయడంతో ప్రతీ నెల క్వింటాలు నుంచి రెండు క్వింటాళ్ళ వరకు నష్టం వస్తోందన్నారు. అనంతరం గోదాం ఇన్‌చార్జి శంకర్‌కు వినతిపత్రం అందించారు. డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, నస్పూర్, మంచిర్యాల, జైపూర్, మందమర్రి, హాజీపూర్ డీలర్ల సంఘం అధ్యక్షులు, డీలర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి : ముస్తాబైన చర్చ్‌లు

చెన్నూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. పలు చర్చిలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ది లివింగ్ గార్డ్ మినిస్ట్రీస్ చర్చితోపాటు ఎర్రగుంటపల్లి, సోమనపల్లి గ్రామాల్లోని చర్చిలను వేడుకలకు ముస్తాబు చేశారు. కిష్టంపేటలోని లివింగ్ గార్డ్ చర్చిను 1999లో పాల్‌రెడ్డి, సరోజనలు స్థాపించారు. చర్చికి ప్రతీ ఆదివారం క్రైస్తవులు ప్రార్థనలు చేస్తారని పాస్టర్ పాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏసుక్రీస్తు ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): పొన్నారం గ్రామంలో యేసుక్రీస్తు సువార్త సంఘం చర్చిలో క్రిస్మస్ పండగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చర్చి ఫాదర్ దయాకర్ తెలిపారు. 2010లో చర్చిని ప్రారంభించామని, అప్పటి నుంచి ప్రతీ ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాగిడి మల్లేష్, నీలం వెంకటేష్, నీలం ఆనంద్, దుర్గం సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వ నమోదు

జన్నారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం జన్నారం ప్రెస్‌క్లబ్‌లో చేపట్టారు. 24 మంది జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

తాండూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం ప్రారంభించారు. రేచినిలో రూ.3 కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని మండలాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పట్టి విష్ణు కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన దుర్గం రామకృష్ణ, మైదం అనిల్‌లను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయా లని సూచించారు. సూరం రవీందర్‌రెడ్డి, ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు గంగిరెడ్డి తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. తిరుపతిరెడ్డి తండ్రి ముత్తయ్య ఇటీవల మృతి చెందారు. ముత్తయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు. గట్టు మల్లేష్, శంకర్, మాజీ సర్పంచులు తోట సుజాతశ్రీనివాస్, సంధ్యామహేష్ తదితరులున్నారు.

భీమిని, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ దారిశెట్టి వెంకన్న ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వినోద్ పరామర్శించారు. వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. మాధవరపు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, రాకేష్‌శర్మ, చిలుముల శంకర్, సంగర్స్ రవీందర్‌రావు, శ్రీహరిరావు, అంకూస్ ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎంపీ

నస్పూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరింది. శిబిరాన్ని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పోడేటి సంజీవ్, రాష్ట్ర కార్యదర్శి అత్రం భుజంగరావు, రెడ్డి మల్ల ప్రకాష్ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు సత్యనారాయణ, పూదరి తిరుపతి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, మైనార్టీ అధ్యక్షుడు కలీద్ సందర్శించారు. ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పర్యావరణం కాపాడడం అందరి బాధ్యత

జన్నారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల అభయారణ్యంలో పర్యావరణం కాపాడడం అందరి బాధ్యత అని జన్నారం, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. మంగళవారం అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారి వెంటఉన్న ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. ఎండుటాకులను తొలగించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు ఉందన్నారు. పర్యావరణం, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

గర్మిళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆలిండియా బంజారా సేవ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాములు నాయక్ కోరారు. దేశంలో 15 కోట్ల మంది బంజారాలు మాట్లాడే భాషను గుర్తించాలని, టీటీడీ బోర్డులో బంజారాలకు అవకాశం కల్పించాలన్నారు. బదావత్ ప్రకాష్ నాయక్, రాజ్‌కుమార్ నాయక్, రాజునాయక్, చంద్రునాయక్, రాంబాబునాయక్, పాల్గొన్నారు.

రాయితీ కొందరికే

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం కొందరికే పరిమితమైంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి విద్యుత్ జీరో బిల్లుకు అర్హత సాధించినా వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం వర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో నిరుపేదలకు ఎప్పటి మాదిరిగా వంటగ్యాస్ ధర భారంగా తయారైంది.

- జిల్లాలో సగానికిపైగా వినియోగదారులకు అందని వంటగ్యాస్ సబ్సిడీ
- ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- జిల్లాలో 1,39,562 కనెక్షన్లు
- గ్యాస్ ఏజెన్సీలకు సైతం స్పష్టత కరువు
- బీపీఎల్ వినియోగదారులపై భారం





ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మహిళ

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించాల్సిన వంటగ్యాస్ రాయితీపై క్షేత్ర స్థాయిలో గందరగోళం నెలకొంది. ఎవరికి రాయితీ వస్తుందో ఎన్ని సిలిండర్లకు వస్తుందో అర్హతను ఎలా నిర్ధారించారనే విషయం తెలియక సరైన సమాధానం చెప్పేవారు లేక వినియోగదారులు నిత్యం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ విషయంలో ప్రజలు కొంతమేర సంతృప్తిగానే ఉన్నా వంటగ్యాస్ విషయంలో సగానికి పైగా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 12 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో..

జిల్లా వ్యాప్తంగా భారత్, ఇండియన్, హెచ్‌పీ కంపెనీలకు సంబంధించి 12 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిపరిధిలో సుమారు 1,39,562 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సింగిల్ కనెక్షన్లు 1,11,898, డబుల్ కనెక్షన్లు 27,664 వరకు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా వినియోగదారులకు రాయితీ అందని ద్రాక్షగానే మారింది. రాయితీతో తమకు సంబంధం లేదనే ధోరణిలో గ్యాస్ కంపెనీలు సమాధానం ఇవ్వడం శోచనీయం.

ప్రజాపాలనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి బీపీఎల్ కు టుంబాలను గుర్తించి తెల్ల రేషనుకార్డు ప్రామాణికంగా అర్హులను ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతీ కుటుంబానికి నెలకు ఒకటి చొప్పున సబ్సిడీ సిలిండర్ ఇచ్చేలా ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. కాగా అర్హులైన చాలా మంది వినియోగదారులకు రాయితీ వర్తించడంలేదు.

కేంద్రం సబ్సిడీ రూ. 40.71 మాత్రమే..

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీని పరిమితం చేసింది. సిలిండర్ ధర ఎంత పలికినా సబ్సిడీ సొమ్ము మాత్రం రూ. 40.71లు మాత్రమే వినియోగ దారుడు ఖాతాలో జమ చేస్తోంది. పదేళ్ల క్రితం వరకు సబ్సిడీ పై- రూ.414కు మాత్రమే వంట గ్యాస్ ధర సరఫరా జరిగేది. మిగతా ధరను కేంద్ర ప్రభు త్వం ముందస్తు గానే భరించేది. ఆ తర్వాత వంట గ్యాస్‌కు నగదు బదిలీ పథకం పర్తింపజేయ డంతో బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సిలిండర్ సరఫరా చేసి ఆ తర్వాత సబ్సి డీ నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తూ వచ్చారు.

పరిష్కారమేదీ..?

మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ఫలాలు వర్తించని కుటుంబాల కోసం దరఖాస్తుల సవరణకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలు సైతం పరిష్కారం చూపించడంలేదు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో వంటగ్యాస్ సిలిండర్ రాయితీ అందని లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనె క్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్లను సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. పలువురు దరఖాస్తులు చేసుకుంటున్నా ఇప్పటికి పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం..



ప్రజాపాలనలో దరఖాస్తు అందించి ఏడాది కావ స్తున్నా నేటికి గ్యాస్ సబ్సిడీ అందడంలేదు. తప్పని పరి స్థితుల్లో పూర్తి డబ్బులు చెల్లించి సిలిండర్ పొందు తున్నాం. ఎంపీడీవో కార్యాలయం, గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి సమస్యను వివరించినా పరిష్కారం కాలేదు. అధి కారులు మరోమారు పరిశీలన చేసి రాయితీ అందేలా చూడాలి.

- బోయిరే చంద్రకళ, ఆసిఫాబాద్

ఆన్‌లైన్‌లో డబ్బులు జమ అవుతాయి..

ప్రభుత్వం రాయితీ డబ్బులను ఆన్‌లైన్‌లో విని యోగదారుడి బ్యాంకు ఖాతాలోనే జమ అవుతాయి. రాయితీ విషయంలో సంబందిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలి. ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలి.

- వినోద్,
జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 31తో ముగియనున్న వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మార్చి 31, 2025 వరకు పొడిగించినట్లు రాష్ట్ర ఇన్‌ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ డిపార్టుమెంట్ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కబడ్డీ జట్టుకు అభినందన

కెరమెరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన కెరమెరి జట్టును మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజద్‌పాషా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జనగాంలో నిర్వహించే పోటీల్లో సైతం బహుమతి గెలుపొందాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట నాయకుడు అబ్దుల్‌కలాం, సిబ్బంది ఉన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమి పూజ

వాంకిడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం చిచ్చుపల్లి గ్రామంలో మంగళవారం కోళ్ల ఫాం షెడ్ నిర్మాణానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ ద్వారా మంజూరు చేసిన వెయ్యి కోడి పిల్లల పెంపకానికి గాను ఉపాధిహామీ నిధులతో కోళ్ల ఫాం షెడ్ నిర్మించనున్నామని చెప్పారు. అనంతరం దాబా, సవాతి,దొడ్డిగూడ, చిచ్చుపల్లి, నవేదరి గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులు, ఇందిరమ్మ గృహాల సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కోసం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జనవరి 8న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లహు కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పట్టించుకోక పోవడంతో 12 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కట్లు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించి.. సూచనలు చేసి..



కెరమెరిలో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

కెరమెరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్‌తివారి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సంబంధిత అధికారులను అడిగి తెలుసుకునానరు. మొబైల్ యాప్ ద్వారా చేపడుతు ఈ సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్ఠిక ఆహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మోడి గ్రామంలో కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించని వారిపై చర్యలు తీసుంటామని హెచ్చరించారు. విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంఈవో ప్రకాష్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శిశు సంక్షేమ శాఖ అదికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాలలో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాల పనులు అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, మూత్రశాలల నిర్మాణం, భవనాలకు రంగులు, పిల్లలకు ఆట వస్తువులు, సమకూర్చడం వంటి పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. భవనాల మరమ్మతు పనులకు అవసరమైన ప్రతిపాదనలను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేసి అనుమతులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, సీడీపీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు



క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు పత్రీకలుగా నిలుస్తాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగలు సంస్కృతి, సంప్రదా యాలకు పత్రీకలుగా నిలుస్తాయని అన్నారు. శాంతి, కరుణ, క్షేమగుణం నేర్పే ఏసుక్రీస్తు బోధనలు అందరికి ఆదర్శనీయమని తెలిపారు. క్రీస్తు శాంతి, ప్రేమ, సహనం, సౌభ్రాతృత్వం, మానవత్వం వంటి సుగుణాలను ఆచరించి, ఆచరింపజేసి ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శ్యాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు అహ్మద్, ఫాస్టర్లు నారాయణ, రాజు, రాజేష్, సుప్రీం, జాన్‌పాల్, రాజు, మురళీ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలంలోని ఎంఎస్ టాలెంట్ పాఠశాలలో ప్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ టాలెంట్ పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

జైనూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్‌లో మంగళవారం సద్గురు పులాజీబాబా సమాధి మహోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. బాబా సతీమణి, ధృపదబాయి, కుమారులు కేశవ్ రావ్ ఇంగ్లే, వామన్‌రావ్ ఇంగ్లే పాల్గొన్నారు.

వైభవంగా అగ్ని గుండాలు

కౌటాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అగ్ని గుండాలు, మహా హోమం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు అగ్ని గుండాల ప్రవేశం నిర్వహించారు. అనంతరం 116 జంటలతో హోమం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

రెబ్బెన, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా వాహనంలో తరలిస్తున్న పశువులను మంగళవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు రెబ్బెనలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, బోలెరోలో ఏడు ఎద్దులు, మూడు ఆవులు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వీటిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, షేక్ షబ్బీర్, షేక్ అఫ్తాబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చర్చిల ముస్తాబు

- నేడు క్రిస్మస్



సెయింట్ మేరి చర్చిలో అలంకరించిన క్రిస్మస్ చెట్టు

ఆసిఫాబాద్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో క్రిస్మస్ వేడుకలకు ఆయా చర్చిలను ముస్తాబు చేశారు. ఏసు క్రీస్తు జన్మించిన రోజు ప్రతీ యేటా డిసెంబరు 25న క్రిస్మస్‌గా జరుపుకుంటారు. క్రిస్మస్ ముందు రోజు క్రిస్మస్ ట్రీకి అలంకరణ చేస్తారు. బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ సెయింట్ మేరితో పాటు దస్నాపూర్, రాజంపేట, ఎన్‌జీవోస్ కాలనీ, సందీప్‌నగర్ కాలనీలో ఉన్న చర్చిలను ముస్తాబు చేశారు. కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, వాంకిడి, కెరమెరి, జైనూర్, రెబ్బెన తదితర మండలాల్లో చర్చిలను క్రిస్మస్ వేడుకలకు సిద్ధం చేశారు.



ఆసిఫాబాద్‌లో ముస్తాబైన సెయింట్ మేరి చర్చి

జోడేఘాట్‌ను సందర్శించిన మధ్యప్రదేశ్ ఆదివాసీలు



జోడేఘాట్‌లోని భీం విగ్రహం వద్ద మధ్యప్రదేశ్ ఆదివాసీలు

కెరమెరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలోని భీం పోరుగడ్డ అయిన జోడేఘాట్ క్షేత్రాన్ని మధ్యప్రదేశ్ ఆదివాసీల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భీం చరిత్ర గురించి స్థానిక గిరిజన నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మ్యూజియంలోని గిరిజనుల సంస్కృతి చిహ్నాలు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీం మనుమడు సోనేరావు, గ్రామస్థుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి ఘన నివాళి



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేతవన్ బుద్ధ విహార్‌లో పెరియార్ రామస్వామి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పలువురు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు జైరాం, విలాస్, రాజేంద్రప్రసాద్, రోషన్, ప్రతాప్, జైపాల్, చింటు, సురేష్, మోను, వివేక్, ప్రదీప్, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదు

కెరమెరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంతో నిప్పు పెట్టకూడదని ఎఫ్ఆర్‌వో మజారొద్దీన్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన నాగల్‌గొంది గ్రామంలో మంగళవారం ఆయన గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నిప్పుపెట్ట కూడదని చెప్పారు. బీడీలు, చుట్ట తాగి అడవిలో పడేయడం వల్ల విలువైన అటవీ సంపద, జంతువులు అగ్నికి ఆహుతి అయ్యే అవకాశం ఉందని అన్నారు. అడవుల్లో అగ్గి రాజుకుంటే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏల దీక్ష

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి దీక్షలు 15వ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, కార్యవర్గ సభ్యులు మద్దతు తెలిపారు. పలువురు ఉద్యోగులు భిక్షాటన చేసి తన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు శ్రుతిక, తుకారాం, నాగసుధ, నాగేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటాం

బెజ్జూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన డీఎడ్ విద్యార్థిని వెంకటలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని అందుగులగూడ గ్రామంలోని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. విద్యార్థిని మృతిపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఇటీవల మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలను ఆదుకునే వరకు పోరాడుతామని అన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు శంకర్, బాలకృష్ణ, రాజారాం, తిరుపతి, రామయ్య, మోహన్, దిలీప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని పీకలగుండం గ్రామానికి చెందిన దుర్గం కేదారి తండ్రి పోచయ్య మంగళవారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట స్థానికులు తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జిల్లా నాయకులు



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జిల్లా నాయకులు

ఆసిఫాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా ఇన్‌చార్జి కొట్నాక విజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

దహెగాం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి లయన్స్ క్లబ్, హైదరాబాద్ ఐకేర్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం దహెగాం మండల కేంద్రంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 45 మందికి కంటి శుక్లాలను గుర్తించారు. వీరికి శుక్రవారం బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆసుపత్రిలో చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. మరో 105 మందికి చిన్న చిన్న సమస్యలు ఉండడంతో కంటి చుక్కల మందులు అందజేశారు. అవసరమైన వారికి కళ్ల జోళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ సత్యనారాయణ, ప్రోగ్రాం కో చైర్మన్ సిద్దుగౌడ్, నాయకుల కమలాకర్, సంతోష్‌గౌడ్, ప్రసాద్‌రాజు, ధనుంజయ్, సంతోష్, నగేష్‌గౌడ్, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

సిర్పూర్(టి), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం పూర్తి వివరాలను నమోదు చేయాలని చె ప్పారు. ఆయన వెంట కార్యదర్శి సుజాత, లావణ్య తదితరులు ఉన్నారు.